# సర్కారు రాస్తే చాలు!

హైకోర్టును కోరుతూ సభలో తీర్మానం చేయలేం

ఎమ్మెల్యేల ఆస్తుల విచారణపై సభాపతి రూలింగ్

స్వతంత్ర ప్రతిపత్తి కాపాడుకోవాలని స్పష్టీకరణ

లేఖ రాసేందుకు వైఎస్ అంగీకారం

ఆరోపణలున్నవారు ఎలా రాస్తారు?

ఇలాగైతే సమర్థించం: బాబు



హైదరాబాద్ - న్యూస్‌టుడే

ఎమ్మెల్యేల ఆస్తుల విచారణపై న్యాయమూర్తులను కేటాయించాలని కోరుతూ శాసనసభలో తీర్మానం చేయాలన్న ప్రతిపాదనను సభాపతి సురేశ్‌రెడ్డి తిరస్కరించారు. దానికిబదులుగా రాష్ట్రప్రభుత్వమే హైకోర్టుకు లేఖ రాయవచ్చని తెలిపారు. బుధవారం ఉదయం శాసనసభ ప్రారంభం కాగానే ఆయనీ రూలింగ్ ఇచ్చారు. సాంకేతికపరమైన కారణాల వల్ల దీనిపై సభలో చర్చకు అనుమతించి తీర్మానం ఆమోదించడం కుదరని తేల్చిచెప్పారు. 'ఎమ్మెల్యేల అవినీతిపై విచారణ చేపట్టడం కోసం శాసనసభలో చర్చకు అనుమతించి తీర్మానం చేయాలని చాలా మంది సభ్యులు కోరారు. రాజ్యాంగం ప్రకారం శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలు స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థలు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ మూడింటికి ప్రధాన బాధ్యతలున్నాయి. ఒకరి పరిధిని మరొకరు దాటకుండా స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోవలసిన అవసరం ఉంది. అందుచేత రాజ్యాంగపరమైన అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఎమ్మెల్యేల అవినీతిపై విచారణకు సభలో తీర్మానం చేసి హైకోర్టును అడగడం మంచి పద్ధతి కాదు. 1978 నుంచి ఎమ్మెల్యేల ఆస్తులపై న్యాయవిచారణకు ప్రభుత్వం అంగీకరించినందున.. ఇందుకు న్యాయవ్యవస్థను సంప్రదించాల్సిందిగా సర్కారుకు సూచిస్తాం. ఎమ్మెల్యేల ఆస్తులపై విచారణకు న్యాయమూర్తిని కేటాయించాల్సిందిగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి విజ్ఞప్తి చేస్తూ.. రాష్ట్రప్రభుత్వం లేఖ రాస్తుంది' అని రూలింగ్‌లో వివరించారు.

సభాపతి సూచించిన విధంగా విచారణ విషయాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి ప్రభుత్వం తీసుకెళ్తుందని ముఖ్యమంత్రి వైఎస్ చెప్పారు. ముఖ్యమంత్రిపైనే ఆరోపణలున్నాయని, అలాంటప్పుడు విచారణ జరపాలంటూ ఆయనెలా లేఖ రాస్తారని ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రశ్నించారు. ఈ సర్కారు చరిత్రలో జరగని అవినీతికి పాల్పడుతోందన్నారు. అవిశ్వాస తీర్మానంపై విస్తృతమైన చర్చ జరిగిందని, ఇందులో ప్రభుత్వ అవినీతిని ఆధారాలతో నిరూపించామని చెప్పారు. శాసనసభ తీర్మానం చేయాల్సిందేనని, దానినే హైకోర్టుకు పంపించాలని పట్టుబట్టారు. లేని పక్షంలో ప్రజలకు ఎన్నో అనుమానాలు వస్తాయన్నారు. తీర్మానం చేయాల్సిందిగా ముసాయిదా ప్రతిని మంగళవారమే తాము సభాపతికి అందజేశామని మంత్రి రోశయ్య తెలిపారు. సభాపతి రూలింగ్‌ను తాము ఆమోదిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి సంతకంతోనే హైకోర్టుకు లేఖ రాస్తామన్నారు. ఈ సమయంలో తెదేపా సభ్యుడు కరణం బలరాం ఏదో వ్యాఖ్యలు చేయగా.. రోశయ్య స్పందిస్తూ డ్రామా కంపెనీలో చేరారని వ్యాఖ్యానించారు. చంద్రబాబు ఆయనపై మండిపడ్డారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబట్టిన ఎన్టీఆర్ పెట్టిన పార్టీని డ్రామా కంపెనీ అంటారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్‌పై ఎంత గౌరవముందో అందరికీ తెలుసంటూ రోశయ్య ఎద్దేవా చేశారు. తాను తెలివైనవాడినైతే ఇప్పుడు రాజశేఖరరెడ్డిని, గతంలో మర్రి చెన్నారెడ్డి, విజయభాస్కరరెడ్డిలను వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చే ఉండేవాడినంటూ దెప్పిపొడిచారు. నేదురుమల్లి జనార్దనరెడ్డి ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉన్న రోశయ్య.. అప్పటి సీఎం చెప్పినట్లు కాలేజీ అనుమతులు ఇచ్చారని బాబు విమర్శించారు. తమను డ్రామా కంపెనీ అని అనడంపై తెదేపా సభ్యుడు పయ్యావుల కేశవ్ కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అందరిపైనా రుద్దడం ఎందుకు?

1978 నుంచి ఉన్న ఎమ్మెల్యేలుగా ఉన్న వారందరిపై ఈ నిర్ణయాన్ని రుద్దడం సరికాదని సీపీఐ పక్ష నేత చాడ వెంకటరెడ్డి అభిప్రాయపడ్డారు. సభలో తీర్మానం చేయడం కంటే విచారణకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత హైకోర్టుకు లేఖ రాస్తే సరిపోతుందన్నారు. శాసనసభలో జరుగుతున్న చర్చలు.. దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని చాలామంది బయటివారు అంటున్నారని సీపీఎం సభ్యుడు జూలకంటి రంగారెడ్డి చెప్పారు. నిజాయితీ గల రిటైర్డు న్యాయమూర్తితో విచారణ జరిపించి అవినీతి అంతు తేల్చాలని కోరారు. ఈ సభలోని 294 ఎమ్మెల్యేలపై విచారణ జరపాల్సిందిగా హైకోర్టుకు లేఖ రాయాలని భాజపా పక్షనేత కిషన్‌రెడ్డి సూచించారు. ముఖ్యమంత్రి చెప్పిన విధంగానే చేయాలని కొమిరెడ్డి రాములు (కాంగ్రెస్ అనుబంధ సభ్యుడు) కోరారు. చీఫ్‌విప్ కిరణ్‌కుమార్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ.. సభను రద్దు చేసి విచారణ చేయాలా అని ప్రశ్నించారు. సభను రద్దు చేసి ఎన్నికలకు పోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెదేపా నేత యనమల రామకృష్ణుడు చెప్పారు. మీరు రాజీనామా చేయండి మేం కూర్చుంటామని తెదేపా సభ్యులు పట్టుపట్టడం దారుణమని కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ ప్రభుత్వం రాజీనామా చేసే ప్రశ్నే లేదని చెప్పారు.

## సీపీఎం, సీపీఐ, ఎంఐఎంలకు అప్పగించండి

అధికారులపై అవినీతి ఆరోపణలు వస్తే వారిపై చర్య తీసుకునో లేనిపక్షంలో వేరే చోటకు బదిలీ చేసో అతనిపై విచారణ జరుగుతుందని యనమల అన్నారు. ఈ సీఎంతో పాటు మంత్రులపై ఆరోపణలున్నాయని, మరి వారంతట వారే ఎలా విచారణ చేపడతారని ప్రశ్నించారు. ఓ ఏడాది పాటు ఎంఐఎం, సీపీఎం, సీపీఐకు ప్రభుత్వాన్ని అప్పగిస్తే తాము విచారణ చేస్తామని జూలకంటి ప్రతిపాదించారు. దీనికి సిద్ధమని యనుమల చెప్పారు. అసెంబ్లీని రద్దు చేయాలన్నది అప్రస్తుతమని కాంగ్రెస్ సభ్యుడు గాదె వెంకటరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యేలపై విచారణ జరగాల్సిందేనన్నారు. నిష్ణాతులైన న్యాయకోవిదులతో ఎమ్మెల్యేలపై విచారణ చేయించాలని తెదేపా సభ్యుడు రాజేశ్వరరావు సూచించారు. తీర్మానం చేయాల్సిందేనని చంద్రబాబు పట్టుబట్టారు. విచారణకు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వం లేఖ రాస్తుందని సభాపతి తెలిపారు. ప్రతిపక్షాలు కూడా విచారణ జరపాలని కోరుతున్న విషయాన్ని హైకోర్టుకు రాసే లేఖలో ప్రస్తావిస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ అవినీతిని నిరూపించామని చంద్రబాబు చెప్పడంపై ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వం మంచిదో కాదో రెండేళ్ల కింద జరిగిన మున్సిపల్, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల ఫలితాలే తేటతెల్లం చేశాయని తెలిపారు. వచ్చే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లోనూ తేలుతుందన్నారు. మంచివాళ్లమైతే ఉంటాం.. లేనిపక్షంలో పోతామని చెప్పారు. ఈ విషయంలో బాబు ఊహల్లో ఉంటే తామేమీ చేయలేమన్నారు. అసెంబ్లీ తీర్మానం చేస్తేనే కోర్టు ఆలోచిస్తుందని చంద్రబాబు నొక్కిచెప్పారు. మామూలుగా అయితే దీనిపై వాకౌట్ చేయడమో, నిరసన తెలియజేయడమో చేసేవారిమన్నారు. విచారణ కోసం హైకోర్టుకు లేఖ రాయాలన్న నిర్ణయాన్ని తమ పార్టీ సమర్థించడం లేదని స్పష్టం చేశారు. శాసనసభ తీర్మానం చేయాలన్నదే తమ వైఖరని తేల్చిచెప్పారు.